క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు వీరే..




రామిశెట్టి బుల్లిరామకృష్ణ   పోలుపర్తి తాతాజీ

ఏలేశ్వరం: ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాలకు వైఎస్సార్ సీపీ కన్వీనర్లగా కొత్తవారిని నియమించినట్టు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు తెలిపారు. ప్రత్తిపాడు మండల కన్వీనర్‌గా రామిశెట్టి బుల్లిరామకృష్ణ (నాని), రౌతులపూడి మండల కన్వీనర్‌గా పోలుపర్తి తాతాజీలను నియమించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరి నియామకం జరిగినట్టు తెలిపారు.

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కూచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పండితులు స్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామిరామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐప్వా ఆవిర్భావ దినోత్సవం

ఏలేశ్వరం: పట్టణంలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐప్వా) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ నుంచి ప్రధానరహదారి మీదుగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐప్వా నాయకులు రాజాల రత్నం, జక్కంపూడి రాజు, బాషారాజమణి మాట్లాడుతూ దేశంలో సగానికి పైగా మహిళలు ఉన్నా పురుషాధిక్యత కొనసాగడం దారుణమన్నారు. మహిళలపై దాడులను అరికట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంచవల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో దుమ్మల దేవి, బి.ఏగులయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



బతుకు చిత్రం నాటకంలోని కళాకారులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: గ్రామంలో సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కంఠస్ఫూర్తి వంశీయుల ఆడపడుచులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం కత్తిపూడి విఘ్నేశ్వర సాయిదుర్గా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'బతుకు చిత్రం' సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది. కాగా సోమవారం నాటకంలో తల్లి పాత్ర పోషించిన నంది అవార్డు గ్రహీత లహరి (గుంటూరు), విశాఖ కళాకారిణి భానుతో పాటు నాటకంలోని పాత్రదారులను శ్రీసత్తెమ్మతల్లి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాల, పూలమాలతో సత్కరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక చిరంజీవి మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో డాక్టర్ కె.వరప్రసాద్ ఆధ్వర్యంలో అలమండ వీరరాఘవ స్వామి, తనూజనాయుడు పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు వినీత్, జ్యోతి సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. శస్త్రచికిత్స నిమిత్తం 15 మందిని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, కందుల ప్రభాకరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గోకవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై కె.నాగరాజు సూచించారు. మండలంలోని తిరుమలాయపాలెంలో సోమవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలోని ముఖ్యకూడళ్ల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు: గ్రామంలో సోమవారం టీడీపీ నేతలు భవిష్యత్తుకు గ్యారంటీ–బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యమస్తు !

- పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్
- ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది
- ఉద్యోగుల పేర్లతో సైన్‌బోర్డుల ఏర్పాటు




కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. (అంతర చిత్రం) సిబ్బంది వివరాలతో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డు

కిర్లంపూడి: ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మంచి వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దీంతో ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయి. నాడు–నేడు పథకంలో భాగంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా మౌలిక వసతులు సమకూరాయి. గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. అన్ని పీహెచ్‌సీల్లో ఒకే విధమైన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంది. అందుకు తగ్గట్టుగానే పీహెచ్‌సీల్లో ఖాళీ పోస్టుల భర్తీని చేపట్టారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాల సిబ్బంది ఉండేలా రేషనలైజేషన్ చేస్తున్నారు.

గతంలో అరకొర సిబ్బంది

గతంలో ఒక్కో పీహెచ్‌సీలో సిబ్బంది ఒక్కో విధమైన విధులు నిర్వహించేవారు. పీహెచ్‌సీల్లో ఉద్యోగుల సంఖ్యలో తేడాలు ఉండేవి. ప్రజలకు అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందేవి. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది అందుబాటులో ఉండరనే అపవాదు ప్రజల్లో ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐపీహెచ్ (ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్) ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చారు. రేషనలైజేషన్ చేసిన తర్వాత ప్రతి పీహెచ్‌సీకి కేటాయించిన 14 మంది సిబ్బంది వివరాలతో కూడిన సైనింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల కేడర్, పేరుతో కూడిన వివరాలు అందులో ఉంటాయి. రేషలైజేషన్‌లో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల్లో సైనింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలోని పీహెచ్‌సీల వివరాలు

మండలం	పీహెచ్‌సీల సంఖ్య
కిర్లంపూడి	3
గోకవరం	1
జగ్గంపేట	2
గండేపల్లి	2
మొత్తం	8

14 మంది ఉద్యోగులు వీరే

పీహెచ్‌సీల్లో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ప్రభుత్వం 14 మంది ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకుంది. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, హెల్త్ సూపర్ వైజర్లు ఇద్దరు, సీహెచ్‌ఓ లేదా ఎంపీహెచ్‌ఓల్లో ఒకరు, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌ఎన్, ఎఫ్‌ఎన్‌ఓ, లాస్ట్ గ్రేడ్ సర్వర్స్ ఒక్కొక్కరు ఉంటారు.

> **ప్రజలకు మెరుగైన సేవలు**
>
> 
>
> ప్రతి పీహెచ్‌సీలోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రుల ఆధునీకరణతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. ప్రతి పీహెచ్‌సీకి 14 మంది సిబ్బంది అందుబాటులో ఉండడంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది వివరాలతో కూడిన సైన్‌బోర్డులు ఏర్పాటు చేశాం. పీహెచ్‌సీల్లో రోజువారీ ఓపీ సేవలు బాగా పెరిగాయి.
>
> – **పి.సరిత**, డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్, పెద్దాపురం

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



తునిలో బాలికలకు కళ్ల జోళ్లను అందజేస్తున్న దాడిశెట్టి విష్ణుచక్రం, అనుసూరి నాగేశ్వరరావు

తుని: విద్యార్థుల కంటి సంరక్షణకు దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందని ట్రస్ట్ చైర్మన్ దాడిశెట్టి విష్ణుచక్రం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ధనలక్ష్మి జ్యూయలర్స్, అగర్‌వాల్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 480 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో అవసరమైన 100 మందికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. అగర్‌వాల్ కంటి ఆసుపత్రి వైద్యుడు అనుసూరి నాగేశ్వరరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ కార్యదర్శి కుందెం సత్యనారాయణ, హెచ్‌ఎం నూకరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



ఎ.కొత్తపల్లిలో కాలిపోయిన పూరిగుడిసె

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో సోమవారం పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సాలిపేట రామాలయం ఎదురుగా పొన్నగంటి రత్నం పూరిగుడిసెలో హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా పూరిగుడిసె నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే తుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నీటి బిందెలతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గాలుల కారణంగా మంటలు చెలరేగి హోటల్‌లో గ్రైండర్, ఫ్రిజ్, వంట సామగ్రి కాలిపోయాయి. ఈ గుడిసెకు పక్కనే ఉన్న పొన్నగంటి మరిడియ్య, పొన్నగంటి శివ ఇళ్లలో ఏసీలు, కిటికీలు కాలిపోయాయి. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వీఆర్వో కె.వెంకటసుబ్బలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

మంచి జరిగితేనే ఓటేయండి

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- టి.తిమ్మాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



టి.తిమ్మాపురంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: గత నాలుగున్నరేళ్లలో మీకు మంచి జరిగితేనే మాకు ఓటేయండి అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని టి.తిమ్మాపురంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం, పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించామన్నారు. చంద్రబాబు మాదిరి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయలేదన్నారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మహిళలను మోసగించాడన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. 40 ఏళ్లలో టీడీపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్‌టీఆర్ విగ్రహాలు ఏర్పాటుకు పింఛన్‌దారుల నుంచి రూ.500 చొప్పున డబ్బులు వసూలు చేసిన సంఘటనలు మర్చిపోవద్దన్నారు. లబ్ధిదారుల నుంచి ఒక్కపైసా కూడా లంచం తీసుకోకుండా సుపరిపాలన అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సంక్షేమం, అభివృద్ధి కొనసాగించామన్నారు. టీడీపీ హయంలో ప్రజలను పోలీసు కేసులతో ఇబ్బంది పెట్టారని, ఈ ఐదేళ్లలో తాము ఒక్క కేసు కూడా పెట్టలేదన్నారు. గ్రామంలో 80 శాతం మందికి డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలు అందించామన్నారు. గ్రామంలో సంక్షేమం, అభివృద్ధికి రూ.25 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఎల్లప్పుడూ తాను ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవానీ, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి వరలక్ష్మి, ఎంపీటీసీ సీహెచ్ నాగేశ్వరరావు, అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు పేరూరి బద్రినారాయణ, నాయకులు పోతల రమణ, రెడ్డి దత్తుడు, పోల్నాటి ప్రసాద్ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అధికారి వెంకటరావు

తుని రూరల్: బాలల హక్కులు పరిరక్షణకు డీఆర్‌డీఏ, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు పిలుపునిచ్చారు. తుని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏపీఎం వై.రాంబాబు అధ్యక్షతన బాల్య వివాహాల నివారణ, బాల బాలికల చట్టాలు, దత్తత కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, పిల్లలు లేని తల్లిదండ్రులు చిన్నారులను దత్తత తీసుకునే పద్ధతులపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అత్యవసరమైతే 1098, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించడం ద్వారా ఆయా సమస్యలను నిరోధించాలన్నారు. బాల్య వివాహాలు, ఆడ పిల్లల అక్రమ రవాణాలతో కలిగే అనార్థాలను వివరించారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వీఓలకు, వీఓఏలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓలు, వీఓఏలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

తుని రూరల్: బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత కోరారు. మండలంలోని డి.పోలవరంలో సోమవారం మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, ఆడపిల్లల ఆవశ్యకత, అంగన్‌వాడీల కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలను వివరించారు. నాయకులు చిటికెల వరహాలబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సొసైటీ చైర్మన్ వరుపుల సూరిబాబు అన్నారు. శంఖవరంలో సోమవారం ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థతో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు సేవాభావంతో పని చేసి ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్, తహసీల్దార్ విజయ్, ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఈఓపీఆర్డీ రామకృష్ణ, మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, బొట్టా చైతన్య, మేకల సుబ్బయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు కృష్ణ, అడపా సోమేష్, దూడల శివ తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత 2023 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు లారీ వర్కర్స్ కార్యాలయంలో సోమవారం లారీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాలకు లారీ డ్రైవర్లకు రూ.10 లక్షల జరిమానా, పదేళ్ల జైలు శిక్ష విధించడం సరికాదన్నారు. రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో చర్చించకుండా గతేడాది పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ నెల 16న జరిగే భారత్ బంద్‌లో ట్రాన్స్‌పోర్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, శ్రీవరసిద్ధి వినాయక మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు బూసాల శినుబాబు, ముద్దు బాబ్జి, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకును ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేయాలి

రౌతులపూడి: గ్రామంలో రూ.1.10 కోట్లతో నిర్మించ తలపట్టిన రక్షిత మంచినీటి ట్యాంకును ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేయాలని మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాలులో సోమవారం మాలమహానాడు జిల్లా కో ఆర్డినేటర్ చిట్టమూరి గోవిందు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌతులపూడి ఎస్సీ కాలనీలో సాగునీటి సమస్య తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ కాలనీలో నిర్మించాల్సిన వాటర్ ట్యాంకును బీసీ కాలనీలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు కొండబాబు, నొక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల గిరిప్రదక్షిణకు బస్సు సర్వీసు

ఏలేశ్వరం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షిణకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న బస్సు డిపో నుంచి బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారకాతిరుమల మీదుగా ఈ నెల 25న ఏలేశ్వరం చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర రూ.3,450గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 99592 25532 నంబర్ సంప్రదించాలని ఆయన కోరారు.

ఆడపిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

కోటనందూరు: ఆడపిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత సూచించారు. మండలంలోని బొద్దవరంలో సర్పంచ్ వేగి లక్ష్మి అధ్యక్షతన సోమవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను విద్య, క్రీడలు, సామాజిక, రాజకీయ తదితర రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఇంటికి, సమాజానికి వెలుగునిచ్చే ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉన్నత చదువులు చదివించి స్వతంత్రంగా జీవించేలా తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసి వారి జీవితాన్ని నాశనం చేయొద్దని సూచించారు. ఆడపిల్లలను చదివిద్దాం–ఆడపిల్లలను రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

శంఖవరం: పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల జెడ్పీ హైస్కూళ్లు, యూపీ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకూ టీచింగ్ టూల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ ఎస్‌వీ రమణ సోమవారం తెలిపారు. కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలన్నారు.

ఈ–కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

గోకవరం: మండలంలో రైతులు సాగు చేసిన రబీ పంటలకు ఈ నెల 15 నాటికి ఈ–క్రాప్, ఈ–కేవైసీ పూర్తి చేయాలని మండల వ్యవసాయశాఖ సిబ్బందిని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు ఆదేశించారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో మొక్కజొన్న, నువ్వుల పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి వీఏఏలకు పలు సూచనలు చేశారు. మండలంలో కొత్తపల్లి, గోకవరం, అచ్యుతాపురం గ్రామాల్లో ఈ–క్రాప్, ఈ–కేవైసీ వెనుకబడి ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కోరుకొండ ఏడీఏ మల్లికార్జున్‌రావు, ఏఓ రాజేశ్వరి ఉన్నారు.

మంత్రి రాజాకు అండగా ఉంటాం



మంత్రి రాజాను కలిసిన శ్రీసాయి వర్తక సంఘ సభ్యులు

తుని: ఇచ్చిన హామీలు వందశాతం నెరవేర్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు స్థానిక శ్రీసాయి వర్తక సంఘం సభ్యులు అండగా ఉంటారని సంఘ అధ్యక్షుడు యల్లపు సత్తిబాబు అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను సోమవారం శ్రీసాయి వర్తక సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. హామీలు నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు మంత్రి రాజా ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా నెరవేర్చారన్నారు. మార్కెట్లో గత 30 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలకు మంత్రి రాజా పరిష్కారం చూపించారన్నారు. మార్కెట్ లోపల, బయట అద్భుతమైన రోడ్లు నిర్మించి వ్యాపారులు, వినియోగదారుల ఇబ్బందులు తొలగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి రాజా విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

రౌతులపూడి: స్థానిక శెట్టిబలిజపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అన్నవరం సత్యదేవ లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ పర్వత జానకీదేవి చేయూతనందించారు. సోమవారం ఆమె బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులురాజేశ్వరరావు, పి.నాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ సహాయక పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సీడీపీఓ కె.శ్రీలత సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో స్థానికులై, 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు గల పదో తరగతి పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు నివాస ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో పాటు జతచేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ లోగా కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఖాళీల వివరాలు

తుని మండలం రాపాక–2 (ఓసీ), తొండంగి మండలంలో పి.అగ్రహారం–1 (ఓసీ), కృష్ణాపురం–3 (బీసీ–ఎ), పీఈ చిన్నయ్యపాలెం–1 (ఎస్‌సీ) ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరు అంగన్‌వాడీ కేంద్రం–2లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోగా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై అదే గ్రామానికి చెందిన 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వివాహిత మహిళలు (ఓసీ) అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలని సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి కోరారు.

జగ్గంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. జగ్గంపేట మండలంలోని రాజపూడి, జె.కొత్తూరు, కిర్లంపూడి మండలంలో జగపతినగరం గ్రామాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తులను జగ్గంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.